క్లుప్తంగా

19న ఆలయ వార్షిక వేడుకలు

చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆగస్టు 19వ తేదీ నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచే అర్చకులు కె.నాగ రాజుశాస్త్రి ఆధ్వర్యంలో అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రవికుమార్



శావల్యాపురం: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా మండలం కారుమంచి ఎస్సీ కాలనీకు చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మల్లపరపు రవికుమార్ నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. తన పదవికి కృషి చేసిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు.

రికవరీ సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

చిలకలూరిపేట టౌన్: చోరీకి గురైన ఐదుగురి సెల్‌ఫోన్లను ఇటీవల పోలీసులు రికవరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అర్బన్ సీఐ పి.రమేష్, దర్యాప్తులో పోయిన ఐదుగురి సెల్‌ఫోన్లను రికవరీ చేసి శుక్రవారం బాధితులకు అందజేశారు.

వ్యవసాయ అధికారుల తనిఖీ

నరసరావుపేట రూరల్: పట్టణంలోని పురుగు మందుల దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో శుక్రవారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తనిఖీల్లో పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: విత్తనాలు, పురుగుమందులను సరైన బిల్లులు లేకుండా రవాణా చేయరాదని మండల వ్యవసాయాధికారి శ్రీలత హెచ్చరించారు. పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా దుకాణదారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తే రైతులు వెంటనే వ్యవసాయాధికారి సెల్ నంబర్ 8331056944కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలన్నారు.

డిజిటల్ విద్యతో సాంకేతిక నైపుణ్యాలు

చిలకలూరిపేట: డిజిటల్ విద్యావిధానంతో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించవచ్చని ఎంసీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.సుధా చెప్పారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు డిజిటల్ తరగతులపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎ.నీలిమ పాల్గొన్నారు.

పలుకూరుతండాలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

బొల్లాపల్లి: పలుకూరు తండా పంచాయతీ పరిధిలో శుక్రవారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి డి.శ్యామలా దేవి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. దోమల లార్వా వృద్ధి కాకుండా తగు చర్యలు చేపడతామన్నారు.

కొచ్చర్లలో ఆధార్ శిబిరం

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆధార్ సెంటర్ నిర్వహించినట్లు ఎంపీడీఓ రంగనాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆధార్‌లో అవసరమైన సర్వీసులు అందరూ వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.

సాతులూరులో..

నాదెండ్ల: సాతులూరు సచివాలయంలో శుక్రవారం ఆధార్ అప్‌డేట్ సెంటర్ ద్వారా ఆధార్ సేవలందించారు. ఆధార్ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య పర్యవేక్షించారు. శనివారం కనపర్రులో సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు.

దాడికి పాల్పడిన నలుగురిపై కేసు

నాదెండ్ల: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై నలుగురు దాడి చేసి గాయపరచిన ఘటన చందవరంలో చోటుచేసుకుంది. ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పూదోట బాలకృష్ణకు అదే గ్రామానికి చెందిన పూదోట కాటంరాజుకు వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి పది గంటల సమయంలో బాలకృష్ణ బజారులో ఉండగా కాటంరాజు, అతని స్నేహితులు ఆవుల నరసింహ, పూదోట వెంకయ్య, శ్రీనులు దాడి చేసి గాయపరిచారు. గాయాలైన బాలకృష్ణను చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. బాలకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు.

కార్గిల్ విజయ దివస్ ర్యాలీ

నరసరావుపేట రూరల్: కార్గిల్ విజయ దివాస్ ర్యాలీ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోట సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధ వీరులు సాధించిన విజయాన్ని గుర్తు చేస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1999లో కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ దళాలను తరిమి కొట్టడం ద్వారా సాధించిన గొప్ప విజయాన్ని దేశ ప్రజలందరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు పాల్గొన్నారు.

మాజీ సైనిక అధికారులకు సన్మానం..

ఎంఏఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించి కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనిక అధికారులు పులి శ్రీనివాసరెడ్డి, గౌస్ మొహిద్దీన్, వై.జయప్రకాష్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు నివాళులర్పించేందుకు కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. అలాగే శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎస్‌కె ఫాతిమా, స్కౌట్ మాస్టర్ పమ్మి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కోట సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్



కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీలో పాల్గొన్న శంకరభారతీపురం ఎన్‌సీసీ క్యాడెట్స్



మాజీ సైనిక అధికారులను సన్మానిస్తున్న ఎంఏఎం కళాశాల నిర్వాహకులు

ఆయిల్‌ఫామ్‌కు ఎప్పుడూ డిమాండే

నరసరావుపేట: వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆయిల్‌ఫామ్ సాగుపై ప్రచురించిన రైతు డైరీ, కరపత్రాలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఉద్యాన శాఖ అధికారులు కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉన్న పంట అని, ఫామ్ ఆయిల్ గెలల ధరలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ప్రకటిస్తుందన్నారు. ఏపీ ఆయిల్ ఫామ్ యాక్ట్–1993 చట్టం రైతు ప్రయోజనాలను పరిరక్షిస్తుందన్నారు. ఈ పంటకు కూలీల అవసరం చాలా తక్కువని, గెలల కొనుగోళ్లలో దళారీ వ్యవస్థ ఉండదని, నేరుగా రైతుల నుంచి కంపెనీనే కొనుగోలు చేస్తుందన్నారు. మొక్కలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు సబ్సిడీపై ఇవ్వబడతాయని అన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎనిమిది మండలాలను సాగుకు అనుమతించారని చెప్పారు. వీటిలో ఆరింటికి ఈ కంపెనీ ప్రతినిధిగా వ్యవహరిస్తుందన్నారు. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం.రామమోహనరావు, జిల్లా ఏరియా మేనేజర్ నవీన్ పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ర్యాగింగ్ ఘటన దురదృష్టకరం

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాగింగ్‌కు పాల్పడ్డ ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు తెలిపారు. ర్యాగింగ్ ఘటన చోటుచేసుకున్న శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల హాస్టల్‌ను శుక్రవారం రాత్రి కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తతో కలసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కళాశాల యాజమాన్యాన్ని కోరగా హాస్టల్ వార్డెన్, ఎన్‌సీసీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మేజర్ బీఎస్ఆర్‌కే రాజు సస్పెండ్ చేయటంతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. విద్యార్థుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలతో ఫిబ్రవరిలో జరిగిన ర్యాగింగ్ వీడియోలు ఇప్పుడు బయటపడినట్టు తాను భావిస్తున్నానని తెలిపారు. పోలీసుశాఖ హాస్టల్స్‌పై డేగకన్ను వేసి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్టల్ ఇన్‌చార్జి వక్కలగడ్డ కోటేశ్వరరావు, లేడీస్ హాస్టల్ ఇన్‌చార్జి కూనిశెట్టి లక్ష్మయ్య పాల్గొన్నారు.



విద్యార్థులను ఆరా తీస్తున్న ఎమ్మెల్యేఅరవిందబాబు

సాతులూరులో డెంగీ అనుమానిత కేసు

డీఎంహెచ్ఓ పర్యటన

నాదెండ్ల: పల్నాడు జిల్లా సాతులూరు బొమ్మలాట కాలనీలో అనుమానిత డెంగీ కేసులు నమోదు కావడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవిబాబు శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. నాలుగు రోజుల నుంచి 17 ఏళ్ల బాలికకు జ్వరం రావటంతో తల్లిదండ్రులు నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. వైద్యులు డెంగీ వైద్యం అందిస్తున్నారు. దీంతో వైద్యాధికారి రవిబాబు బొమ్మలాట కాలనీలో పంచాయతీ అధికారులు , ఆరోగ్య సిబ్బందితో కలసి పర్యటించారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండే అవకాశం లేకుండా కాలువలు శుభ్రం చేయించి ఎప్పటికప్పుడు బ్లీచింగ్ వేయించాలని కోరారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలన్నారు. ఏఎస్ఎంలకు శనివారం నుంచి ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు. జ్వరపీడితులు ఉన్నట్లయితే వైద్య సేవలందించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనతో పాటూ పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, ఏఎన్ఎం రాజేశ్వరి, వైద్య ఆరోగ్య సిబ్బంది కావేరి ఉన్నారు.



సాతులూరు బొమ్మలాట కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రవిబాబు

నేడు పట్టణంలో యూత్ ఫెస్టివల్



చిలకలూరిపేట టౌన్: ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్తంగా పల్నాడు స్టూడెంట్ అండ్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఏవీ శివయ్య, ఆంజనేయరాజు తెలిపారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఫెస్టివల్‌కు సంబంధించిన వివరాలను వారు తెలిపారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమాన్ని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఫెస్టివల్ లో సింగింగ్, ఫాన్సీ డ్రెస్, ఏకపాత్రాభినయం, ఫోక్, క్లాసికల్ డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్‌లలో విభాగాల్లో జూనియర్, సీనియర్‌కు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు యూటీఎఫ్, జేవీవీ ప్రజాసంఘాల సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీలకు పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటున్నారన్నారు.

ఒకటో తేదీనే నూరు శాతం పెన్షన్లు పంపిణీ చేయాలి

జెడ్పీ సీఈఓ వసంతరాయుడు

యడ్లపాడు: ప్రతినెలా ఒకటో తేదీనే వంద శాతం పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ సీఈఓ ఎన్ఎస్‌బీవీ వసంతరాయుడు ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులతో సమీక్షించారు. సామాజిక పెన్షన్లు ఒకటో తేదీనే విధిగా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ విషయంలో సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రస్తుతం మండలం పరిధిలో ఉన్న సమస్యలు, వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వీటిపై గ్రామీణ ప్రాంత ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బృందావనం వరూధిని, మండల పరిషత్ కార్యాలయం ఏఓ కేఎస్‌బీ సాయి శ్రీనివాస్ ఉన్నారు.



యడ్లపాడు ఎంపీడీఓ మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వసంతరాయుడు

ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దు

నాదెండ్ల: గ్రామాల్లో రాజకీయ కక్షలు లేకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని చిలకలూరిపేట రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి చెప్పారు. మండలంలోని కనపర్రు గ్రామంలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రధాన వీధుల్లో సీఐతో పాటూ ఎస్ఐలు జె.బలరామ్‌రెడ్డి, రాజీవ్‌శామ్యూల్‌పాల్, బాలకృష్ణ, సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసినందున రాజకీయ చర్చలు, కార్యకలాపాలకు స్వస్తి పలకాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడినందున ప్రతి ఒక్కరూ తమ తమ పనుల్లో నిమగ్నమై ప్రశాంతంగా ఉండాలన్నారు. గొడవలు, విధ్వంసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేసి జైళ్లపాలు కావద్దని హెచ్చరించారు. ఎవరైనా ఉద్రేకాలను రెచ్చగొట్టినా, గొడవలకు ఉసిగొల్పినా తమకు సమాచారమివ్వాలని కోరారు.

స్కేటింగ్ క్రీడాకారుడు వంశీ వేదాన్ష్‌కు అభినందన



శావల్యాపురం: స్కేటింగ్‌లో ప్రతిభ చూపిన స్థానిక సంసీద్ విద్యార్థి భవనాశి వంశీ వేదాన్ష్‌కు అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్న సంసీధ్ విద్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ వాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాల ద్వారా శారీరక శక్తితో పాటు మానసికంగా అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇటీవల అమృతసర్‌లో జరిగిన క్రీడా పోటీల్లో 5వ ర్యాంక్, భారతదేశ స్థాయిలో 5వ స్థానం, గోవాలో జరిగిన పోటీల్లో 6వ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో దేశ వ్యాప్తంగా స్థాయిలో 22వ స్థానాన్ని పొందడం గర్వకారణమని చెప్పారు. ఆగస్టు 7 నుంచి 9వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించనున్న ఇండియా స్కేట్ గేమ్స్– 2024లో 5 నుంచి 7 సంవత్సరాల కేడర్ బాయ్స్ స్పీడ్ ఇన్‌లైన్ విభాగంలో పోటీకి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒంటేరు నాగ సురేష్, కోచ్ హరిష్ నందన్ పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని పాత చెరుకుంపాలెంలోని అంగన్‌వాడీ స్కూల్, ఎంపీపీ పాఠశాలను మండల స్పెషలాఫీసర్, పులిచింతల ప్రాజెక్టు డెప్యూటీ కలెక్టర్ వరదా సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల భోజన సదుపాయాలు, రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య పనులు, డ్రైనేజీ, శానిటేషన్ గురించి పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబుని అడిగి తెలుసుకున్నారు. వీర్వో యోగయ్యతో మాట్లాడి విద్యార్థులకు సంబంధించిన ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్లు సరైన సమయంలో ఇవ్వాలని సూచించారు.

అంగన్‌వాడీ సెంటర్..

ఈపూరు: మండలంలోని అగ్నిగుండాల బీసీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌ను మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి శుక్రవారం సందర్శించారు. చిన్నారులకు వండిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగనాయకులు, సీడీపీఓ అరుణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చిన్నమ్మాయి పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న స్పెషలాఫీసర్ సుబ్బారావు

ఆటపాటలతో కూడిన విద్య

బొల్లాపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల ప్రత్యేకాధికారి బి.రవిబాబు అన్నారు. ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో మండలంలోని పలుకూరు తండా పంచాయతీ పరిధిలోని సోమ్లువాగు తండాను శుక్రవారం మండల స్థాయి అధికారులు సందర్శించారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

నాదెండ్ల: మానవ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని, హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేయాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాస్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మానవ హక్కులు, వినియోగదారుల హక్కులు, ఆన్‌లైన్ మోసాలు, బాలకార్మిక వ్యవస్థ రద్దు, బాల్యవివాహాల రద్దు, పోక్సోపై అవగాహన కలిగించారు. ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమను తాము గౌరవించుకోవటంతో పాటూ ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సెక్రటరీ తాళ్లూరి సత్యనారాయణ, పూనూరి కృష్ణకుమారి, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు అడపా అశోక్‌కుమార్, సీడీపీఓ శాంతకుమారి, అడిషనల్ సీడీపీఓ నిర్మలారాణి పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళులు

నరసరావుపేట: ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చేనేత రంగానికి కోటయ్య చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సంక్షేమ సంఘం కమిటీ ప్రెసిడెంట్ గుంటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి చిన్నం రామాంజనేయులు, జి.జోగేశ్వరరావు, చిన్నం వెంకటేశ్వర్లు, అవ్వారు రవికాంత్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గోనె సురేష్, ఉద్దంటి సుబ్బారావు, దినేష్, ఊట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



నరసరావుపేట టౌన్: హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని రైల్వే సీఐ రవీంద్ర అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో రైల్వే, ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులు సంయుక్తంగా శుక్రవారం హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన అవగాహన ర్యాలీ మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనదారులు నడుచుకోవాలని కోరారు. మొదట రైల్వే స్టేషన్ వద్ద నుంచి మొదలైన అవగాహన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల కొనసాగింది. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు, ఎస్ఐ వేణు, ఎంవీఐ శ్రావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

■ **కమ్యూనిటీ హాలు తాళాలు ధ్వంసం**

నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ల కమ్యూనిటీ హాలులో నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక రేషన్ డీలర్ తన రాజీనామాను రెవెన్యూ అధికారులకు అందజేశారు. అప్పటి నుంచి రేషన్ పంపిణీని గ్రామ రెవెన్యూ అధికారికి అప్పగించారు. జూన్, జూలైలో నిల్వ ఉన్న రేషన్ బియ్యం కమ్యూనిటీ హాలులో నిల్వ చేసి తాళం వేశారు. అయితే కొందరు స్థానికులు దురుద్దేశపూర్వకంగా అధికారులను తప్పుదోవ పట్టించారు. కమ్యూనిటీ హాలులో అక్రమంగా రేషన్‌బియ్యాన్ని నిల్వ చేశారంటూ ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ అష్రిపున్నిసాబేగం, చిలకలూరిపేట సీఎస్‌డీటీ లక్ష్మణరావులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు హడావుడిగా కమ్యూనిటీ హాలు వద్దకు చేరుకుని హాలు తాళాలు పగలగొట్టారు. నిల్వ ఉన్న బియ్యం, రికార్డులు పరిశీలించారు. 28 బస్తాల బియ్యం రికార్డుల మేరకు సక్రమంగానే ఉన్నట్లు గుర్తించారు.

■ **సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి**

రొంపిచర్ల: ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు డిజిటల్ టెక్నాలజీ నేర్చుకోవడం ఎంతో అవసరమని

సంక్షిప్త వార్తలు

ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ అన్నారు. మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ కార్యక్రమాలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.రవి నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు డిజిటల్ టెక్నాలజీ నేర్చుకోవడం అవసరమన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, సాంకేతిక ఆవశ్యకతను గురించి కంప్యూటర్ అధ్యాపకులు నారపరెడ్డి, శ్రీనివాసరెడ్డి వివరించారు.

■ **చిన్నారుల ఆధార్ నమోదు పెంచాలి**

శావల్యాపురం: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల ఆధార్ నమోదు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పిచిపకలపాలెంలోని అంగన్‌వాడీ సెంటరు సందర్శించారు. ఆయనతో పాటు సర్పంచి గణపర్తి ఆంజనేయులు (బుల్లోడు), ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్, సెంటరు కార్యకర్త రమాదేవి ఉన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు

నాదెండ్ల: ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి ప్రయత్నించిన వృద్ధుడిపై స్థానిక పోలీసులు పోక్సో కేసును నమోదు చేశారు. వివరాలు... మండలంలోని గణపవరంలోని హెచ్‌జేబీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలు పాఠశాల విడిచి పెట్టిన తర్వాత స్కూల్ ప్రాంగణంలో ఆటలాడుకుంటున్నారు. స్కూల్ ఎదురుగా చికెన్‌షాపులో వర్కర్ షేక్ మస్తాన్‌వలి అలియాస్ అహ్మద్‌అలి వారిని గమనించి మాయమాటలతో చికెన్‌షాపులోకి తీసుకెళ్లాడు. ఇద్దరి దుస్తులు పూర్తిగా తీసేసి అసభ్యంగా ప్రవర్తించసాగాడు. దీంతో భయపడిన బాలికలు ఒకరు అతని చేతి నుంచి విడిపించుకుని పరుగున ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయాన్ని వివరించింది. వెంటనే అక్కడకు వచ్చేసరికి వృద్ధుడు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో నాదెండ్ల పోలీసులను ఆశ్రయించారు. బాలికల తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ జె.బలరామిరెడ్డి తెలిపారు.

అమ్మవారికి బోనాలు




బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పట్టణంలోని ముండ్లమూరు డౌన్‌లోని మహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు బోనాలు సమర్పించారు. పట్టణ పురవీధుల్లో బోనాలు ఊరేగించి వేడుకగా అమ్మవారికి అర్పించారు. ఆనవాయితీలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు మహిళలు బోనాలు సమర్పించారని కమిటీ పెద్దలు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో అదపాల రాములు, సోము కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– వినుకొండ(నూజెండ్ల)

ముగిసిన ఉపాధి పథకం ప్రజావేదిక

శావల్యాపురం: జాతీయ ఉపాధి పథకం 16వ విడత ప్రజావేదిక కార్యక్రమం ముగిసింది. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ రామారావు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 1-4-203 నుంచి 31-03-2024 వరకు రూ.5.84 కోట్లతో 375 పనులు చేసినట్లు చెప్పారు. ప్రజావేదికలో ఉపాధి సిబ్బంది నుంచి రూ.80 వేలు రికవరీ చెల్లించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సామాజిక పింఛన్లు 17 మంది ఇటీవల మృతి చెందితే ఇందుకుగాను రూ.75 వేలు ఆయా వేల్పారు, మతుకుమల్లి, గుంటుపాలెం, కారుమంచి, శానంపూడి గ్రామాల్లో అవకతవకలకు పాల్పడినట్లు సామాజిక బృందాలు గుర్తించినట్లు తెలిపారు.



ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు